కథ

# శ్రుతి తప్పిన రాగం

నంబూరి పరిపూర్ణ



ఈ బిఎస్సీ అవగానే ఏ ఉద్యోగం దొరికినా చేయాల్సిందే అని అనుకుంటున్న శారదకు ఫస్టుక్లాసు వచ్చి కొత్త ఆశల్ని రేపింది. ఎంఎస్సీ మైక్రో బయోలజీ చేసి పిహెచ్‌డి కూడా చేస్తే అద్భుతంగా వుంటుంది భవిష్యత్తు.

మరుక్షణంలోనే నిరాశ. తమ కుటుంబ ఆర్థిక స్థితి పై చదువుకనువుగా వుందా? తను త్వరగా ఉద్యోగం చేసి అమ్మకు అండగా నిలవాలి. తనకి ఊహ తెలిసినప్పట్నుంచీ, తననీ తమ్ముడినీ సంరక్షిస్తున్నది, ఎంతో శ్రద్ధతో చదివిస్తున్నదీ ఒక్క అమ్మే. తనది క్యాంపుల ఉద్యోగమైనప్పటికీ పిల్లలకి ఏ ఇబ్బందీ, లోటూ రానివ్వదు.



పోయినేడాది పెద్ద తమ్ముడు ఇంటరు ఫస్టుక్లాసు లోనూ, చిన్నాడు టెన్తుక్లాసు స్కూలు ఫస్టుగానూ పాసయ్యాడు. పెద్దవాడు ఇంజనీరింగులో జాయిన య్యాడు. చిన్న తమ్ముడిని డాక్టరు చదివించాలని, బైపిసి గ్రూపుతో ఇంటరు చదివిస్తోంది అమ్మ. మరి తను చెయ్యందించకుండా ఇద్దర్నీ ఆ కోర్సు చదివించ డం సాధ్యమా ఆమెకు.

వరుసగా నాలుగు రోజుల ఆలోచన తరువాత ఉద్యోగ సంపాదనకు బిఇడి మంచి మార్గమని తోచి, అదే చేద్దామని నిర్ణయించుకుంది శారద. కూతురి నిర్ణయం తల్లి అరుంధతిని గగ్గోలు పరిచింది. ''డిగ్రీతోనే చదు వాపే ఖర్మేంటి నీకు? దీనికి నేనొప్పుకోను. ఎంఎస్సీ చేయాల్సిందే'' అంది దృఢంగా.

తల్లికి అనేక విధాలుగా ఓపిగ్గా నచ్చచెప్పి, ఎలాగై తేనేం బిఇడిలో చేరింది శారద. జిల్లా సోషల్ వెల్‌ఫేరు ఆఫీసులో సెక్షనాఫీసరు అరుంధతి. నిర్వహణ నిధులూ, విద్యార్థుల ట్యూషన్ ఫీజులూ, స్కాలర్‌షిప్పులూ, వీటి తాలూకు బడ్జెట్స్, జిల్లా ఆఫీసు ద్వారా రిలీజవుతుంటాయి. అందుకు సంబం ధించిన 'సీటు' అరుంధతిదైనా ఆమెది తామరాకు మీది నీటిబొట్టు వైఖరి. కమిషన్లూ, పర్సంటేజీల వ్యవహారాలన్నీ ఆఫీ సరుగారికి సంబంధించినవి.

★★★

బిఇడి ముగించి ఉద్యోగపు వేటకు పూనుకుంది శారద. స్వంత టౌన్‌హాలులోనే ఓ సేవా సంస్థ నిర్వ హణలోని హైస్కూల్లో సైన్సు అసిస్టెంటు పోస్టు దొరికి శారదలో ధైర్యాన్ని, కొత్త ఉత్సాహంనింపింది.

కూతురు రెక్క అందిస్తుండడం వల్ల అరుంధతి గుండెల్లో ఆదుర్దా తగ్గి నిబ్బరం పెరగసాగింది.

డిప్యూటీ తహసీల్దారు చంద్రమోహన్‌కి తాలూకా గ్రామాల్ని తరచూ విజిట్ చేసి రావడం డ్యూటీలో ఒక భాగం. ఆఫీసుకు హాజరైన రోజు మాత్రం త్వరగా తన సీటు పని ముగించుకొని ఆ అమ్మాయి వెళ్లిపోతుందేమో అనుకుంటూ రోడ్డెక్కుతుంటాడు. ఆమె కనపడితే ఆనందం, కనిపించుకుంటే చింత ఎందుకు తనకు?

ఓ సాయంత్రం గుండె దిటవు చేసుకొని రోడ్డు దాటి ఆమెని సమీపించి, ''క్షమించండి మేడమ్! మీకు ఈ స్కూల్లో పని అనుకుంటా. మీరు టీచింగు స్టాఫా? నాన్ టీచింగ్ కేడరా? ఊరకనే... ఏం లేదు... రోజూ కని పిస్తున్నారు గదా... తెలుసుకుందామనీ..'' మర్యాద ఉట్టిపడిందతని పలకరింపులో.

ఆశ్చర్యంగా చటుక్కున తలెత్తి చూస్తూ... ''ఇందులో క్షమించాల్సిందేముందిలెండి. టీచింగు స్టాఫ్. సైన్సు అసిస్టెంటును. నైన్తు క్లాసు టీచర్ని కూడా '' జవాబిచ్చింది తొట్రుపాటు లేకుండా.

''అలాగా! సంతోషమండీ! నేను ఈ మధ్య ఇదిగో... ఈ ఆర్డీవో ఆఫీసులోకి డిప్యూటీ తహసీల్దా రుగా వచ్చాను. ఆఫ్‌కోర్సు డైరెక్టు రిక్రూట్‌మెం ట్‌లే లెండి. నడిచి వెడుతున్నారు ఇల్లు దగ్గరేమో''

''దూరమే లెండి. గాంధీనగర్''

''అరె! మాదీ అక్కడే, మార్కెట్టు వెనక వీధి!''

అలాగా అంటూ నవ్వి. ముందుకు సాగిపోయింది శారద. అప్పట్నుంచీ శారద కనిపించగానే విష్ చేస్తు న్నాడు చంద్రమోహన్. ఏదో రీతిగా మాటలు కలిపి, పరిచయం పెంచుకుంటున్నాడు. చిన్నతనం నుంచీ శారద తల్లి ప్రేమ ఒక్కటి తప్ప తండ్రి అనురాగాన్నెర గదు. ఇప్పుడీ చంద్రమోహన్ చూపిస్తున్న ఆప్యాయత కొత్త అనుభూతులందిస్తోంది.క్రమంగా వ్యక్తిగత విష యాల్నీ, కుటుంబ సమస్యల్ని పరస్పరం అరమరిక లే కుండా చెప్పుకునే స్థితి ఏర్పడింది. అసంతుష్టమైన శారద కుటుంబ నేపథ్యం, ఆమె పట్ల మరింత అనురా గాన్నిపెంచాయి చంద్రమోహన్‌లో.

★★★

రోడ్డు వార కబుర్లు చెప్పుకుంటూ సాగిపోతున్న

**పరవశంతో తియ్యగా నవ్వుతూ చంద్రమోహన్ని చూసింది శారద. అతను కూడా హాయిగా నవ్వి ''పాట ఎంత కమ్మగా వుందో! అందుకే మీ కళ్లు అంత ఆనందాన్ని వర్షిస్తున్నాయి. మీకు సంగీతం అంత ఇష్టమా శారదగారూ!'' అడిగాడు మోహన్. ''అంతా ఇంతాగాదు. బోల్డంత ఇష్టం. కళలన్నింట్లో నేను ఎక్కువగా ఇష్టపడేది సంగీతమే. నాలాగే మీకూ అని మనం విన్న ఆ పాట చెప్పింది లెండి''**



శారద, మోహన్లు ఆ పక్కింట్లోంచి సిడి ప్లేయర్ వెదజల్లుతున్న పాట మాధుర్యం విని చటుక్కున నిలబడ్డారు. పరవశంతో తియ్యగా నవ్వుతూ చంద్రమోహన్ని చూసింది శారద. అతను కూడా హాయిగా నవ్వి ''పాట ఎంత కమ్మగా వుందో! అందుకే మీ కళ్లు అంత ఆనందాన్ని వర్షిస్తున్నాయి. మీకు సంగీతం అంత ఇష్టమా శారదగారూ!'' అడిగాడు మోహన్.

''అంతా ఇంతాగాదు. బోల్డంత ఇష్టం. కళల న్నింట్లో నేను ఎక్కువగా ఇష్టపడేది సంగీతమే. నాలాగే మీకూ అని మనం విన్న ఆ పాట చెప్పింది లెండి''

''అవునవును నాక్కూడా ఇష్టం. అంతేకాదు. నాటకాల్లో నటించడమూ ఇష్టమే లెండి నాకు. శలవు రోజు సాధారణంగా మా ఎమెచ్యూర్ డ్రామా మిత్రులతోనే గడుపుతుంటాను. పండుగలకీ, ఫంక్ష న్లకీ ప్రదర్శనలిస్తుంటాం అందరం కలిసి''

శారద అతన్ని అబ్బురంగా చూస్తూ ''అయితే మీకు నటనతో పాటు, పాడడం కూడా వచ్చి వుంటుంది ఏమంటారు?''

''ఆ... ఏదో లలిత సంగీతాన్ని శ్రోతల్ని బాధ పెట్టకుండా పాడగలను లెండి. శాస్త్రీయ సంగీతం కూడా. కొద్దోగొప్పో నేర్చుకొని వుంటే బాగుండేది. చదువుకే సరిపోయింది సమయమంతా''

''అందుకు విచారిం చాల్సిన పన్లేదులెండి. మంచి కంఠంతో లలిత గీతాలనాలపించుతుంటే ఆ రసాత్మకతే వేరు! మన చిన్నతనంలో అంతకు ముందు వచ్చిన కళాత్మక చిత్రాల పాటలు విన్న ప్పుడు ఎంతగా ప్రాణం లేచివచ్చినట్లుంటుంది అందరికీ! ఆ పాటల్నీ నా కిష్టమైన భావగీతాన్ని తీరికున్నప్పుడల్లా హార్మనీ మీద వాయిస్తూ, పాడు కోవడం నేను చాలా ఇష్టంగా చేసేపని''

''భలే! చక్కగా చెప్పారు. అయితే నాలాగే మీక్కూడా సంగీతమన్నా, లలిత గీతాలన్నా ఇష్ట మన్నమాటే'' మోహన్ అభినందనల పరంపరతో, శారద ధన్యవాదాలతో– ఇద్దరి నడక వేగం పుంజు కుంది.

★★★

శారద, మోహన్ ఒకరి సన్నిధిలో ఒకరు ఎంతో స్వాంతన పొందుతున్నారు. ఆత్మీయులుగా మారుతున్నారు.

ఆ రోజు సాయంత్రం చంద్రమోహన్ శారద కనపడగానే''మీతో ఒకటి చెప్పాలని వుంది నాకు. అది మన మధ్య రోజువారీ ముచ్చట్లే గాక మరే దైనా వుండాలని. మనిద్దరికీ సంగీతమంటే ఇష్టమే కదా! అంతేకాదు. బాగా పాడగలం కూడా. కానీ ఒకరి గొంతు మరొకరికి వినిపించుకున్నామా ఇంతవరకు?'' అని ప్రశ్నించాడు.

''ఆ మాట నిజమే కానీ ఎక్కడ ఏ ఏకాంతంలో కూర్చుని పాడుకుందాం చెప్పండి''

''సంకల్పించుకోవాలి కానీ, ఏ కొండ ప్రదేశా లకు లోటెక్కడుంది చెప్పండి. మీరు అవునంటే ఇప్పుడే నాకు తెలిసిన ఒక చోటుకెళ్లి, ఈ చల్లటి సాయంత్రమంతా హాయిగా పాడుకుంటూ గడపచ్చు''

''అదేదో దగ్గరి చోటయితే, చీకటిగాక ముందే ఇంటికి చేరుకోగల్గుతాం''

''దగ్గరే మీరే చూస్తారుగా'' అని ఒక్కంగలో ఆఫీ సునించి బైకు తెచ్చేసి ''రండిపోదాం!'' అన్నాడు చంద్రమోహన్.

మొదట మోహన్ గొంతు విప్పి ''శారదగా రూ పొద్దు ఆట్టే లేదు. కాబట్టి మనం మాటల బదులు సరాసరి పాటల్లోకి దిగితే మంచిదిగదా!''

''సరే, అలాగే! మరి ప్రారంభించండి''

బెట్టుగా మళ్ళీ అడిగిం చుకోడానికి సమయం లేదు. ఓ మాటు గొంతు సవరించుకుని పాట ఎత్తు కున్నాడు చంద్రమోహన్. శారద కూడా తనకిష్టమైన పాటల్ని పాడింది. శారద పాడిన తీరుకి మోహన్ పర వశుడై ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని అభి నం దించాడు. ఎదురుచూడని సంఘటనతో ఆమె కాసేపటికి తేరుకుంది. అభిరుచులు, జీవన విలు వల్లో సారూప్యత వున్న స్త్రీ పురుషులు కలిసి జీవించడంకంటే మించింది ఇంకేముంది? అంటూ శారద ప్రశ్నించిన తీరులోనే సమాధానాలు లభించడంతో తృప్తిగా ఆమెకళ్లలోకే చూస్తూండిపో యాడు మోహన్.

★★★

శారదకు తల్లంటే ఎంత ప్రేమో అంత భయం. చంద్రమోహన్ గురించి చెప్పాలనుకుంటూనే, వాయిదావేస్తూ వస్తోంది.

చంద్రమోహన్ ఆఫీసు పని మీద రాజధానికి వెళ్తూ మూడో నాటికి వచ్చేయ్యనా అన్నాడు. అలా రాకపోగా ఉత్తరమైనా రాయనందుకు కష్టంగా వుంది శారదకు. కానీ ఉత్తరమొచ్చి తమ్ముడి చేతిలో పడిందనీ, వాడది తల్లికిచ్చాడనీ తెలియదా మెకు. ఎడ్రసు మగదస్తూరీలో వుండేటప్పటికి దాన్ని చించి చదవాలనిపించింది అరుంధతికి.

''నాప్రియ శారదా! క్షేమమేగదా! నేనిక్కడి కొచ్చి ఐదురోజులవుతున్నా పని యింకా పూర్తి కాలేదు. రెవెన్యూ బోర్డు డైరెక్టరు వారం రోజులు శలవు అనంతరం రేపు తిరిగి జాయినవుతాడట. ఎల్లుండికి పని పూర్తయిపోతుంది. ఆ రాత్రే మనూరి బస్సెక్కేస్తా. ఆత్మీయుల అనురాగాన్ని దూరం పెంచుతుందనే మాటనిజం. అనుక్షణం కళ్ళలో మెదులుతున్నావు. త్వరలో కలుసు కుందాం. నీ చంద్రమోహన్''


అరుంధతి ఆ ఉత్తరం మరో మారు చదివింది ఇతడెవరో శారదను యిష్టపడుతున్నాడు. ఈమె కూడా అతన్నిష్టపడుతున్నట్లుంది. ప్రేమ ముందు వెనకల్ని చూడనివ్వదా. ప్రేమిస్తున్నామనే మగాళ్ళు కడవరకూ నిలబడేదెంత వరకు? అబ్బాయిల ప్రేమల్ని అక్షరాలా నమ్ముతారు అమ్మాయిలు. ప్రేమి కుడు తప్ప మరో లోకముండదు వాళ్ళకి. స్కూలు నించి వచ్చి, కాఫీ తాగి, పత్రిక చూస్తున్న శారద ముందు ఉత్తరాన్నుంచి ''ఎవరితను?'' అంది గంభీరంగా అరుంధతి. శారద ముందుగా గతు క్కుమని యింక దాచి లాభం లేదని, చంద్రమో హన్ వివరాల్ని చెప్పేసింది. కూతురి కథనమంతా ఓపిగ్గా విన్న మీదట గతకాలపు తన జీవితాన్ని నెమరువేసుకోకుండా వుండలేకపోయిందా తల్లి.

చంద్రమోహన్ అనే ఆ యువకుడు తనను ప్రాణాధికంగా ప్రేమిస్తూ, పెళ్ళికి సిద్ధపడుతున్నాడని శారదచెబుతోంది. అదెంతవరకు నికరమైన అను బంధమవుతుందో చూడాలి. కష్టసుఖాలన్నిటా సహభాగి కాగలడేమో చూడాలి.

★★★

అరుంధతి వెంటనే చంద్రమోహన్ కుటుంబపు మంచిచెడ్డల గురించి వాకబు చేసి వివరాలు తెలుసుకుంది.

అతని తండ్రి చిన్న స్థాయి పోస్టుమాస్టరు. తల్లి



టీచరు. చెల్లెళ్ళిద్దరూ కాలేజీ చదువులు చదువుతున్నారు. తల్లిదండ్రులకు కొడుకు మీద అమిత ఆపేక్ష, అత్యంత ఆశ. కొడుకు పెళ్ళిని ఒక అపురూప ఘటనగా కలగంటూ వుంటారు. అతని హోదాకు తగ్గట్టుగా అడిగినంత కట్నంతో అందమైన కోడలొచ్చి తమ దశతిరగడం ఖాయమనుకుంటున్నారు.

మరి తనూ తన కుటుంబం కట్నకానుకలకు పూర్తిగా వ్యతిరేకం. తన పిల్లల్ని కులమతాలతో ప్రమేయం లేని రీతిలో పెంచింది. తనుగాని, తన కూతురు గానీ, కట్నం ప్రసక్తి లేని పెళ్ళినే కోరుకుంటారు. అలాంటి సంబంధాన్నే అంగీకరిస్తారు. ఇందుకు మరి చంద్రమోహన్ అంగీకరించగల్గుతాడా! శారద చదువూ సంస్కారాన్ని మాత్రమే పరిగణించి పెళ్ళికి సిద్ధమౌతాడా! కొద్దిరోజుల అనంతరం, తమ ఇంటికొచ్చి, తన తల్లితో తమ పెళ్ళిగురించి చెప్పి మాట్లాడి వెళ్ళమని శారద కబురు బెట్టగా వచ్చి అరుంధతిని కలిశాడు చంద్రమోహన్. ఆమె అతనికి మామూలు సమాజరీతికి భిన్నంగా వున్న తమ కుటుంబ ఆదర్శాల గురించి చెప్పి ఆ పైన అతని ఉద్దేశమూ, నిర్ణయమేమిటో తెలుపమని అడిగింది.

''నాక్కావలసింది శారద మాత్రమే! ఏ శుష్క ఆచారాల్తోనూ నాకు పన్లేదు'' అని ఒక్కముక్కలో సమాధానమిచ్చాడు.

★★★

మరుసటి రోజు తల్లితండ్రీ ముందు తన మనసు విప్పాడు మోహన్. శారద అనే హైస్కూలు టీచర్ని ప్రేమించాననీ, ఆమెనే పెళ్ళాడదలిచాననీ స్పష్టంగా చెప్పేశాడు. సంగతి వింటూనే కన్నవాళ్ళ గుండెలు గుభిల్లుమన్నాయ్. ఏం మాట్లాడకుండా గుటకలు మింగసాగారు. పెళ్ళి అనే దానికి ప్రేమ జతవడితే తప్పకుండా అది బోల్డు చిక్కుల్నీ, నష్టాన్నీ తెచ్చిపెడుతుంది. లోకవ్యవహారం జ్ఞానం లేని కుర్రాళ్ళు ప్రేమజపం తప్పితే మరేదీ ఆలోచించరు. తను యిష్టపడే అమ్మాయినే చేసుకోవాలనుకున్నా, పెళ్లి సంబంధమైన యితర వ్యవహారాల సంగతేంటి? వాటిపైన దృష్టి వుందా అసలు!

''ఒరే అబ్బాయ్! నీ పెళ్ళి విషయంలో నీ నిర్ణయమేంటో తెలిపావు. బాగుంది. అది విని మేము కూడా నిన్ను అర్థం చేసుకోవలసిన అవసరముంది. మరి ఈ సందర్భంలో మేము చెప్పేది కూడా నువ్వు అర్థం చేసుకోవాలి. పెళ్ళి ఏ తీరుదైనా కావచ్చు. ముందుగా పిల్ల సంబంధీకులు మనింటికి రావాలి. మనతో సంప్రదింపులు జరపాలి. అది రివాజని నీకూ తెలుసుగదా''

''కానీ నాన్నా! పిల్ల యిష్టప్రకారం పెళ్ళి చెయ్యడం తప్ప యితరమైన రివాజు లేవీ పాటించరు వాళ్ళు. వాళ్ళ పద్ధతులన్నీ వేరు''

''ఏ పద్ధతీ వాళ్ళకి లేకపోవచ్చు. మనకైతే వుంటాయిగదా! అల్లుడిగా నీకందవలసిన వరదక్షిణ, యితర పెట్టిపోతల విషయం తేలాలి గదా! ఒక పని చేద్దాం. మనమే మన తరపున పెద్దమనిషి నొకర్ని పంపించి వ్యవహారాలన్నీ మాట్లాడి రమ్మందాం, విషయాలన్నీ తేటతెల్లమవుతాయప్పుడు'' అన్నాడు తండ్రి.

మోహన్ పరిస్థితి అయోమయంగా మారింది. తామంతా 'వరకట్న' వ్యతిరేకులమనీ, పెళ్ళికో 'తోడు' కోసం తప్ప, పోషణ ఆశించి కాదనీ శారద అనేకమార్లు చెప్పడం తను మనస్ఫూర్తిగా ఆమెతో ఏకీభవించడం జరిగింది. పెద్దవాళ్ళ అభీష్టం ప్రకారం కట్నాల బేరాలకు దిగితే శారద తనకు రక్కదు. ఆమెను దప్ప మరెవర్నీ భార్యగా ఊహించుకోలేడు తను.

''నాన్నా! అమ్మా! ఇటు వినండి. ఆ అమ్మాయికి డిగ్రీ చదువూ, మంచి ఉద్యోగమూ వుంది. ఆమె సంపాదన మనదే అవుతుంది గదా! పైగా మనతో పూర్తిగా కలిసిపోయే మనసున్నపిల్ల. వేరే కట్నమెందుకు మనకు?'' అన్నాడు చంద్రమోహన్.

''చదువూ సంపాదనలున్నా, కట్నాలులేందే పెళ్ళిళ్ళవుతున్నాయా ఆడపిల్లలకి? అదలా వుంచి, కట్నం పుచ్చుకోని మగాణ్ణి ఒకణ్ణి చూపించు ఈ రోజున! కట్నంతీసుకోకపోడం ఎంత చులకన పని. వరుడికి ఏ లోపమో వుందనుకోరా నలుగురూ?''

తండ్రికి తను జవాబు చెప్పలేని ప్రశ్నలు. తనేమో శారదను ఒదులుకోలేడు. పోనీ పెద్దవాళ్ళు చెప్పినట్లు, ఓ మధ్యవర్తిని వాళ్ళింటికి పంపి, ఆమె తల్లితో మాట్లాడిస్తే ఏం పోతుంది.

★★★


ఆదివారం నాడు మోహన్ కుటుంబం తరపున వచ్చిన ఓ పెద్దాయన, అరంధతిని కలిసి, పెళ్ళి సంప్రదింపులు ప్రారంభించాడు. వారి దగ్గర సెలవు తీసుకుని తిరిగి వెళ్ళి జరిగిన సంవాదన యావత్తూ చంద్రమోహన్ తల్లిదండ్రులకు వివరించాడు మధ్యవర్తి.

రెండు వారాలు గడిచాయి. చంద్రమోహన్ పెద్దల్నించి కబురూ లేదు. కనీసం అతనైనా వచ్చి ఏ మాటాతెలుపలేదు. ఈ సంబంధం ఒదులుకోక తప్పదని బాగా వత్తిడి చేసికొడుకును బలవంతంగా ఒప్పించి వుంటారు పెద్దవాళ్ళు అని రూఢి చేసుకుంది అరుంధతి. మరో పక్క శారద తమ కోడలైతే చాలంటూ మిత్రులు కొంతమంది ముందుకు రాసాగారు. తమ ఆదర్శాలకూ, శారద చదువు వ్యక్తిత్వాలకు విలువిచ్చే మిత్రులు బాగానే వున్నారు. శారదేమో తన ప్రేమకు సాటి మరేదీ లేదనుకుంటున్నది. పలు విధాల ఆలోచిస్తూ, ఆవేదనపడుత్తూ కూతురి ధోరణి మార్చాలని ప్రయత్నిస్తోంది అరుంధతి. దగ్గరి బంధువులు, మిత్రులు ఎన్నో విధాల నచ్చజెప్పసాగారు శారదకు. ఆమె మాత్రం''చంద్రమోహన్‌కి కట్నం ఆశ అస్సలేదు. ఇప్పటికిప్పుడు తనవాళ్ళనే మార్చలేకపోయినా, నెమ్మదిగా మార్చితీరతాడు. అతన్ని కాదని నేను వేరే దారి తొక్కితే ఆత్మహత్య చేసుకుంటానని అనేకసార్లు కంటతడి పెట్టాడు. అతని మరణానికి నేను కారణం కాలేను'' అంటూ దుఃఖపడుతోంది.

మేనమామంటే మిక్కిలి అభిమానం, గౌరవం శారదకు అందుకని తమ్ముడ్ని పిలిపించింది అరుంధతి. నచ్చచెప్పగలడన్న నమ్మకంతో. మామ మాటలన్నీ ఎదురు పలక్కుండా నెమ్మదిగా విని ''నేను దూరమైతే మోహన్ బతకడు మామయ్యా! ఆ తరవాత నేనెలా బతగ్గలను? ఇద్దరం ఈ లోకం విడిచిపోవడమొక్కటే దారి'' అని గావురుమంది.

''అక్కయ్యా శారద కోరిక మనం తీర్చక తప్పదు. కాదంటే ఏదో అఘాయిత్యం తప్పక చేసుకుంటుంది. నీకిది ఒక్కగాని ఒక్కతె. జరగరానిదేమైనా జరిగితే నీకు జీవితాంతం మిగిలేది కడుపు శోకమే. దానిష్టప్రకారమే కానిద్దాంలే'' అని నచ్చచెప్పి, ఓదార్చాడు తమ్ముడు.

★★★



తమకు తామై మధ్యవర్తిని మంతనాలకు పంపితే, ఆడపిల్ల వాళ్ళు అల్లుడికి పైసా రాల్చమనీ, అది తమ సిద్ధాంతమనీ అనడం మోహన్ తల్లిదండ్రులకు నషాళమంటినట్టు అయ్యింది. అలాంటి మొండివాళ్ళతో ఏం గతిలేక సంబంధమందుకోవాలి? ''ఒరే బాబూ నీ అందచందానికీ, హోదాకీ కో అంటే కోటి మంది అందగత్తెలు, లక్షల మూటల్తో వచ్చి వాల్తారు. ఇంక ఈ పంతులమ్మ సంగతి మర్చిపో''అంటూ పోరడం మొదలెట్టారు.

కనీ, పెంచీ ఎన్నో యిబ్బందులు పడుతూ యింతగా చదివించి, మంచి హోదా కల్పించిన కన్నవాళ్ళను తన మాట వినేలా చెయ్యాలని శాయశక్తులా పోరాడాడు మోహన్. ఫలితం కనబడక అలసిపోయాడు. ''సరే, ఆ అమ్మాయిని మరచిపోడానికి ప్రయత్నిస్తా. అందుకు నా షరతు యిది. ఇంకేనాడు మీరు నా పెళ్ళి ఊసు ఎత్తగూడదు. ఇలా ఒక్కణ్ణీ బతకనివ్వండి చాలు. ఈ నా నిర్ణయానికి తిరుగుండదు'' అన్నాడు భీష్ముడి లాగ.

ఉన్న ఫళంగా పెద్ద పిడుగు తమ తలల మీద పడ్డట్టయ్యిందిదంపతులిద్దరికీ. ఎటూ చెప్పలేక మూగబోయారు.

కానీ కొడుకు పెళ్ళి ఆలోచన్లు కొంచెం కూడా వదిలిపోవడం లేదు. ఇంట పెళ్ళి జరగక కొడుకు బ్రహ్మచారైపోతే వాటిల్లే నష్టాన్ని అంచనా వేసుకుని, అనునిత్యం అలజడి పడుతున్నారు. రోజుల తరబడి ఆలోచించాక, చివరకు కొడుకిష్ట ప్రకారమే జరగనిద్దామని తీర్మానించారు. ఇందుకు దోహదకారి ఆ యిద్దరి బుర్రల్లో తళుక్కున మెరిసిన గొప్ప యుక్తి! అదే అదను చూచి వాతపెట్టే ఉపాయం. భార్యాభర్తలకి గొప్ప భరోసాను, ధైర్యాన్నియిచ్చిన ఉపాయం.

''నాన్నా ఒక్కగానొక్క కొడుకు కోరికను మన్నించలేనంత కఠినులుగాదులేరా! ఆ శారదను కోడల్ని చేసుకుందుకు అందరూ అంగీకరించామని ఆమె తల్లికి కబురు పంపెయ్'' అని తల్లీ తండ్రీ అంటుంటే తనచెవుల్ని తను నమ్మలేకపోయాడు చంద్రమోహన్ గుండెలు నవ జవ్వనంతో ఉప్పొంగాయి. అతి శీఘ్రగతిన అరుంధతిగారికి శుభవార్త అందింది. ఇరుపక్షాలు ఆ మర్నాడే కలుసుకోడం, ముహూర్తం నిర్ణయించడం చకచకా జరిగాయి. వీరివీ వారివీ శుభలేఖలు అచ్చయి వచ్చేశాయి.

పెళ్ళి ఏర్పాట్లలో ఎక్కువ భాగం మోహన్ స్వయంగా, హుషారుగా చేసుకుంటున్నవే. తండ్రి ముఖంలో మాత్రం తమ ఇంట శుభకార్యం జరగబోతున్నదన్న ఆనందపు ఛాయ కొంచెమైనా లేదు. మనసులో గోప్యంగా వుంచిన సంగతిని ఎలా కొడుక్కు తెలియచెప్పి ఒప్పించడం అన్న ఆలోచన లోలోన సుళ్ళు తిరుగుతోంది.

పగలంతా పనుల్లో మునిగి, సాయంత్రపువేళ కొంచెం విశ్రాంతిగా సోఫాలో కూర్చున్న కొడుకుతో ఎట్టకేలకు అన్నాడు తండ్రి ''అయ్యా చందూ ఓ ముఖ్య విషయాన్ని అంటే ఈ పెళ్ళికి సంబంధించిందాన్నే, నీకు గుర్తు చెయ్యాలని వుంది నాకు. నీ ఆనర్సు చదువు కేవలం మా యిద్దరి చిన్న జీతాలతోనే పూర్తి కాలేదు. నీకవసరమైన డబ్బు కోసం సంపాదన జతవడుతున్నది గదా అనుకుంటున్న సమయానికి, నీ చెల్లెళ్ళు కాలేజీ చదువులకొచ్చి, ఖర్చులు తిరిగి యిబ్బడి ముబ్బడయినాయి. నీ వరకు నువ్వు కట్నం తీసుకోవు. కానీ నీ చెల్లెళ్ళకు కట్నం తీసుకోని మొగుళ్ళను తేగలవేమో చెప్పు''.

తండ్రి మాటలూ, మరో వైపు ఎంతో ఆవేదనపడుతూ తల్లి వాడికిస్తున్న వత్తాసు చంద్రమోహన్ ఆలోచనల్లో ఏవో కొత్త కోణాలకు తావిస్తున్నాయి. ఈనాటి సమాజ ధర్మం నించి బయటికి రాలేమన్న జంకును కలిగిస్తున్నాయి.

తండ్రి మళ్ళీ కొనసాగిస్తూ ''మనింటి పరిస్థితి మాట అలా వుంచి, రూపాయి మాత్రం కట్నమనేది లేని ఈ పెళ్ళి, బంధువర్గం మధ్య నిన్నొక బికారి వాళ్ళా నిలబెట్టి తీరుతుంది. నీ విద్య, నీ హోదా ఒట్టి పనికిమాలినవని అనిపిస్తాయి అందరికీ'' అని తండ్రి కర్చీఫ్‌తో కళ్ళద్దుకుంటుంటే మోహన్ గుండె ద్రవించింది.

''నాన్నా ఏం చెయ్యడానికి వుందిప్పుడు ఆడపిల్ల వాళ్ళతో అన్ని మాటలూ అయినాకనే మనం పెళ్ళి ముహూర్తాలు పెట్టుకున్నాం. ఈ దశలో మీరిలా అసంతృప్తిపడి ఏం లాభం?'' అన్నాడు మోహన్ ఓదార్పుగా.

ఇప్పుడు తల్లి అందుకుంది ఆవేశంతో గూడిన ఓ విధమైన ఉత్సాహంతో ''ఇప్పటికైనా ఏం మించిపోలేదురా నాన్నా! మా యిద్దరికీ భలే ఆలోచనొకటి వచ్చింది. అది నువ్వు శ్రద్ధబూని అమలు చేశావూ, పరిస్థితి మొత్తం మనకనుకూలమై తీరుతుంది. లోపలికెళ్ళాం పద, వివరంగా అంతా విందువుగాని'' అని ఆమె అనగానే ఆశ్చర్యపోతూ అమ్మానాన్నలను అనుసరించాడు మోహన్.


★★★

శారద పెళ్ళి శుభలేఖలు పది దినాలు ముందే బంధువులందరికీ చేరిపోయాయి. అక్కకు సహాయంగా ఊర్నించి అరుంధతి చెల్లెలొచ్చింది. అక్కచెల్లెళ్ళు కలిసి, ఆ రోజు మధ్యాహ్నం పెళ్ళి పిలుపులకెళ్ళారు. మిత్రులకు స్వయంగా శుభలేఖలివ్వాలని శారద తమ్ముళ్ళు కూడా బయటికెళ్ళారు.

మోహన్ యిటువైపు రాక అప్పుడే ఐదురోజులయ్యింది. పనులన్నీ పాపం ఒక్కడే చూచుకోవాలి గదా మరి అని శారద అనుకుంటుండగానే గేటు చప్పుడై అతను ప్రత్యక్షమవ్వడంతో ప్రాణం లేచి వచ్చిందామెకి. నిష్ఠూరాలు అనంతరం కుశలప్రశ్నలు ప్రారంభించింది. ఆమె ప్రశ్నలకు తడిపొడి జవాబులొస్తున్నాయి అతన్నించి. ముఖం ప్రసన్నంగా గాక ముభావంగా, గంభీరంగా వుంది. చప్పచప్పటి సంభాషణ మధ్యలో వున్నట్టుండి ''శారద మన పెళ్ళికి సంబంధించిన ముఖ్య సంగతులు కొన్ని నీతో మాట్లాడాలి నేను'' అన్నాడు మోహన్.

నిర్ఘాంతపోతూ అతని ముఖంలోకి చూచింది శారద.

''ఏమనుకోకు విషయంలోకి సరాసరి దిగుతున్నా. మాది మధ్యతరగతినీ, మా అమ్మానాన్నలు చాలా చిన్న ఉద్యోగులనీ తెలుసుగా నీకు. అంచేత నా చదువుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. అప్పులు చేసి తప్ప నన్ను పోస్టుగ్రాడ్యుయేట్‌ని చెయ్యడం సాధ్యంకాలేదు. ఇప్పుడు మళ్ళీ మా చెల్లెళ్ళ చదువులూ త్వరలోనే జరగబోయే పెళ్ళిళ్ళూ తలకుమించిన భారం వాళ్ళకు. తమ కొడుకు పెళ్ళి వల్ల అందే భారీ కట్నంతో, అప్పులు తీర్చి కూతుళ్ళకు మంచి భర్తల్ని సంపాదించి, చివరి కాలాన్ని సుఖంగా గడపవచ్చుగదా అని అందర్లా మా వాళ్ళూ ఆశించారు. ఉన్న ఒక్క కొడుకూఅసలు కట్నమే లేని పెళ్ళికి సిద్ధపడుతున్నాడన్న నిరాశతో



## కోలీవుడ్‌కి
## దూరమవుతున్న ప్రియమణి

**త**మిళంతోపాటు తెలుగులో మంచి ఆఫర్లతో జనం ఆదరాభిమానాల్ని చూరగొన్న ప్రియమణి ఇకనుంచి ఎక్కువకాలం హైదరాబాద్‌లో వుండాలనుకుంటోందిట. తెలుగులో కొత్తదనంతో కూడిన పాత్రలు లభిస్తుండడంతో ఆమె ఎంతో సంతోషంగా ఉంది. అందుకోసమే ఆమె త్వరలో ఇక్కడే ఓ 'ఇంటి'దవ్వాలని కోరుకుంటోంది. అందుకోసం తన సన్నిహితుల్ని పురమాయించింది. కమ్మనైన తెలుగు నేర్చుకుంటూ తెలుగు ప్రేక్షకులకి మరింత దగ్గరవ్వాలనుకునే ఈ అమ్మడు, మంచి ఇల్లుకొనుక్కుని హైదరాబాద్‌లో సెటిలవ్వడం ఆమెతో పాటు ఇండస్ట్రీకి కూడా మంచిదే కదా!



మూలబడిపోయారు''

''నేను చెప్పలేదు నీకు. నెలక్రితం ఒక జూనియర్ ఇంజనీరమ్మాయి సంబంధమొచ్చింది. ఎనిమిది లక్షలివ్వడానికి సిద్ధమయ్యారు. మరే పిల్లనూవాళ్ళెంతిచ్చినా చేసుకునేది లేదని చెప్పా. మన యిబ్బందులు తీరాలంటే అందులో సగమైనా యివ్వాలని నీ ప్రేమికురాలికి చెప్పి ఒప్పించాలి. అలా చెయ్యను కుదరదు అంటే చెప్పు నేనిక ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటా అని మా అమ్మ తెగేసి చెబుతోంది. మా ఇంటి పరిస్థితిని కొంచెం అర్థం చేసుకో శారదా! నాలుగు లక్షలకి మీ మదర్ని ఎలాగైనా ఒప్పించు''

మునుపెన్నడూ తను చూడని కొత్త మనిషిలా కనిపిస్తున్నాడు మోహన్, శారదకు. ''మోహన్ ఇప్పుడివన్నీ ఏమిటి? ఈ సంగతి ముహూర్తం పెట్టుకోకముందే చెప్పి వుంటే, యింత దూరమొచ్చేవాళ్ళం గాదుగదా. మీ చెల్లెళ్ళ చదువులకీ, పెళ్ళిళ్ళకీ డబ్బు బాగా అవసరమే. మనకి పెళ్ళయి, నేను మీ ఇంట్లో మనిషినయ్యాక ప్రతి విషయంలోనూ నా పూర్తి సహకారాన్ని అందించనా?''

''ముందు కాలంలో మంచే జరిగి తీరుతుందని ఎలా నమ్ముతారు పెద్దవాళ్ళు. ప్రస్తుత స్థితి తమ కనుకూలంగా లేదనేదే వాళ్ళ బాధ. కట్నం ఊసులేని కొడుకుపెళ్ళివల్ల యిటు నష్టమూ, అటు నలుగురిలో నగుబాటు అని కుమిలిపోతున్నారు. నాకూ యిది భరించలేని పరిస్థితీ. అంచేత నా మాట కొంచెం తలకెక్కించుకుని, మా వాళ్ళడుగుతున్న ఈ కాస్తయినా, మీ అమ్మతో యిప్పించక తప్పదు''

''కట్నాలే నలుగుర్లో విలువ పెంచుతాయి. భార్య తెచ్చే డబ్బుతో ఆడబిడ్డలకి మంచి భర్తల్ని కొనుగోలు చెయ్యొచ్చు ఇలాంటి వ్యవహారాల్లో మావి ఎంతో ఆరోగ్యకరమైన అభిప్రాయాలు. పోషించుకోగలగాలి. ఇప్పటి భర్త, యిది వరకులా భరించేవాడుగా వుండగూడదు. అప్పుడింక కనీసం విద్యా వికాసాలున్న మనలాంటి వాళ్ళం, ఈ వ్యాపార వివాహపద్ధతుల్ని మార్చేయవద్దా మోహన్?''

''ఈ ప్రసంగాల్ని వినే ఓపిక నాకు లేదిప్పుడు. మీ సిద్ధాంతాలతో మా వాళ్ళ ప్రాణాలు పోయేట్టు వున్నాయి. లోకరీతిని గమనించి, వేరే వాళ్ళివ్వ చూపిన మొత్తంలో సగమైనా యివ్వండి. అలా కుదురదు అనంటే ఈ పెళ్ళి కూడా జరగదూ అని ఆఖరిమాటగా చెబుతున్నాను'' తేల్చిచెప్పాడు మోహన్.

''ఓహో సంగతి అర్థమైందిలే. అన్ని చోట్లకీ శుభలేఖలు వెళ్ళాయి. పెళ్ళి దగ్గరబడుతోంది. ఇంక యిప్పుడు మాకు మీ డిమాండును కాదనలేని యిరకాటపు స్థితి అని మీ ఆలోచన కాదు ఎత్తుగడ. ఏ కారణం వల్లయినా నేన్నీకు దక్కకపోతే విషం తీసుకు ప్రాణమొదుల్తాననేవాడివి చాలాసార్లు. ఇప్పుడేమో నీ ప్రేమకు ఖరీదు చెల్లించమంటున్నావు. మర్యాదల ముసుగులో జరిగే దోపిడీయే కట్నమని ఎన్నిసార్లనేవాడివి నువ్వు.''

''మా ఇంటి పరిస్థితి తెలియక అన్నానప్పుడు. కాలమెలా వుందిప్పుడు? డాక్టర్లూ ఇంజనీర్లయిన స్త్రీలు సైతం సాటి డాక్టర్నీ యింజనీర్నీ లక్షల, కట్నమిచ్చి పెళ్ళాడ్డం లేదా?''

''వాళ్ళలా ఆత్మగౌరవమన్నది లేకుండా లొంగిపోయేదాన్ని గాదు నేను. ప్రేమ పెళ్ళయినా, పెద్దలు కుదిర్చిన పెళ్ళయినా, కట్నం చెల్లించి మాత్రం నాకో తోడును కొనుక్కోను''

''శారదా తండ్రి లేని పిల్లవి ఈ పెళ్లి ఆగిపోతే మరో సంబంధం రావడం చాలా కష్టం.''

''నాకలాంటి బెంగేం లేదు. బ్రతుక్కీ, భవిష్యత్తుకీ పెళ్లి ఒక్కటీ ఆధారమని అనుకోను. నిజానికి నేటి ఆధునిక స్త్రీకి పెళ్ళి ఒక కత్తుల బోనవుతోంది. పెద్ద ప్రతిబంధకమూ అవుతోంది. మొన్న అందరికీ శుభలేఖలు పంపాము గదా ఈ రోజే పెళ్ళి రద్దయిందని తెల్పుతూ లేఖలు రాస్తాం. పరిస్థితి యిలా మారినందుకు, మా అమ్మగానీ, తమ్ముళ్ళుగానీ రవ్వంత కూడా బాధపడరు'' అని ముగించి గబ్బుక్కున ఓ కాగితమందుకుని ''ఫలానా తేదీన మా ఇంట జరగాల్సిన పెళ్ళి కారణాంతరాల వలన రద్దయ్యింది. శుభలేఖలు పంపి, శ్రమ కలిగించినందుకు చింతిస్తున్నాం'' అని వ్రాసి ''మోహన్ ఈ కొత్త లేఖ మొదట నీకే అందిస్తున్నాను'' అంటూ చేతిలో వుంచింది.

అతడు తెల్లపోయి చూస్తుంటే శాంతంగా స్థిరంగా గేటు తెరిచింది శారద వీడ్కోలు చెప్పడానికి.

★